సాక్షి
యాదాద్రి భువనగిరి
మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



ఏసీబీ వలలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్
నల్లగొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఊరెల్లి సోమేశ్వర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. - 8లో



పీడీఎస్ బియ్యం దందా
నల్లగొండ-నాగర్‌కర్నూల్ జిల్లాల సరిహద్దుల్లో రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా సాగుతోంది. - 8లో



తహసీల్దార్ కార్యాలయానికి తాళం
42 నెలలుగా అద్దె చెల్లించడం లేదని చౌటుప్పల్ తహసీల్దార్ కార్యాలయానికి భవన యజమాని తాళం వేశాడు. - 8లో

న్యూస్‌రీల్

18న పోలింగ్ సిబ్బందికి శిక్షణ

భువనగిరిటౌన్ : మొదటి విడత శిక్షణకు గైర్హాజరైన పోలింగ్ ఆఫీసర్లు, సిబ్బందికి ఈనెల 18న శిక్షణ ఇవ్వనున్నట్లు భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే పేర్కొన్నారు. భువనగిరిలోని వెన్నెల కళాశాలలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఈసారి ఎవ్వరికీ మినహాయింపు లేదని, గైర్హాజరైన ప్రతి ఒక్కరూ హాజరుకావాలని ఆదేశించారు. లేనిపక్షంలో సీసీఏ రూల్స్, ప్రజాప్రాతినిధ్యం చట్టం 127 ప్రకారం చర్యలు ఉంటాయన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు



స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ చేపట్టి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రధానాలయ ముఖ మండపం, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం తదితర కైంకర్యాలతో పాటు స్వామి, అమ్మవారి జోడు సేవలను ఊరేగించారు. రాత్రి స్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

శివాలయంలో..
అదే విధంగా యాదాద్రి కొండపై ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు. మహా శివుడికి ఇష్టమైన రోజు కావడంతో అభిషేక పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.


పార్లమెంట్‌కు పంపితే ప్రజల గొంతుకనవుతా



రామన్నపేటలో ఓటు అడుగుతున్న సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్

రామన్నపేట : లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించి పార్లమెంట్‌కు పంపితే ప్రజల గొంతుకను అవుతానని సీపీఎం భువనగిరి అభ్యర్థి ఎండీ జహంగీర్ పేర్కొన్నారు. సోమవారం రామన్నపేట పట్టణంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాత నియోజకవర్గంగా ఉన్న రామన్నపేట ప్రాంతం మొదటి నుంచి నిర్లక్ష్యానికి గురైందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి శిథిలావస్థకు చేరిందని, సరైన వైద్య సిబ్బంది లేక రోగులకు నాణ్యమైన వైద్యం అందడం లేదన్నారు. ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాలువలు పూర్తి చేయడంలో, ఆసిఫ్‌నహర్ కాలువకు మరమ్మతులు చేయడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. తనకు రామన్నపేట రాజకీయ ఓనమాలు నేర్పిందని, ఈ ప్రాంతంలోని అన్ని పార్టీలు తనకు అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య, మేక అశోక్‌రెడ్డి, ఆవనగంటి వెంకటేశం, జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, వనం ఉపేందర్, గాదె నరేందర్, బోయిని ఆనంద్, నాగటి ఉపేందర్, మామిడి వెంకట్‌రెడ్డి, కందుల హన్మంత్, గొరిగె సోములు, బావండ్లపల్లి బాలరాజు, ఎండీ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం



ధాన్యంతో నిండిపోయిన సూర్యాపేటలోని వ్యవసాయ మార్కెట్ యార్డు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు ధాన్యం పోటెత్తింది. ఆదివారం సెలవురోజు కావడంతో సోమవారం భారీగా ధాన్యం వచ్చింది. ఒక్క రోజే 835 మంది రైతులు ఏకంగా 40,459 బస్తాల ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొచ్చారు. ఇందులో అత్యధికంగా జైశ్రీరామ్ రకం 24,523 బస్తాల ధాన్యం రాగా క్వింటాకు గరిష్టంగా రూ.2,590, కనిష్టంగా రూ.1,501 ధర పలికింది.



బీబీనగర్ ఎయిమ్స్‌లో ఓపీ కార్డు తీసుకోవడానికి బారులుదీరిన రోగులు

కిక్కిరిసిన ఎయిమ్స్

బీబీనగర్ : వైద్యసేవల్లో బీబీనగర్ ఎయిమ్స్ ప్రత్యేకత చాటుకుంటోంది. మూడేళ్ల నాటితో పోలిస్తే ప్రస్తుతం సేవలు మెరుగుపడ్డాయి. ఖర్చు కూడా తక్కువగా ఉండడంతో రోగుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. సోమవారం ఒక్క రోజే 2వేలకు పైగా ఓపీ నమోదైంది. అయితే మూడు కౌంటర్లు మాత్రమే ఉండడంతో రోగులు ఇబ్బందులకు గురయ్యారు. క్యూలైన్‌లో గంట, సీరియల్ ప్రకారం డాక్టర్‌ను కలవడానికి మరో గంట, వైద్య పరీక్షల కోసం మరో 2 గంటలు.. పొద్దస్తమానం ఎయిమ్స్‌లోనే గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టార్గెట్ బీసీలు!

భువనగిరి లోక్‌సభ స్థానంలో బీసీ ఓటర్లే అధికం
- ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ పార్టీల వ్యూహం
- సామాజిక వర్గాల వారీగా సమావేశాలు
- గంపగుత్తగా ఓట్లు రాబట్టుకునేందుకు ఒప్పందాలు



సాక్షి, యాదాద్రి : భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో అధికంగా ఉన్న బీసీ ఓట్లపై రాజకీయ పార్టీలు గురిపెట్టాయి. తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఆయా సామాజిక వర్గాల నేతలతో ప్రత్యేకంగా సమావేశమై ఒప్పందం చేసుకుంటున్నాయి. బీజేపీ, బీఆర్‌ఎస్ నుంచి బీసీలు, కాంగ్రెస్ తరఫున ఓసీ అభ్యర్థి బరిలో ఉన్నారు.

మూడు సార్లు ఎన్నికలు.. ఒకే దఫా బీసీ అభ్యర్థి గెలుపు
జనరల్ కేటగిరీలో ఉన్న భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో బీసీ ఓటర్లు ఉన్నారు. 2009లో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం ఏర్పడగా నాటి నుంచి బీసీ అభ్యర్థులే ఎక్కువగా పోటీలో నిలిచారు. ఈ స్థానానికి ఇప్పటి వరకు మూడు సార్లు ఎన్నికలు జరగగా 2014లో మాత్రమే బీఆర్‌ఎస్ తరఫున బూరనర్సయ్యగౌడ్ విజయం సాధించారు. 2009లో సీపీఎం మిత్రపక్షాల అభ్యర్థిగా నోముల నర్సింహయ్య, 2019లో బీఆర్‌ఎస్ నుంచి బూర నర్సయ్యగౌడ్ పోటీ చేసి ఓడిపోయారు. ఈ రెండుసార్లు కోమటిరెడ్డి సోదరులు విజయం సాధించారు.అయితే ఈ సారి జరుగుతున్న ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గాల్లో బలమైన ఓటు బ్యాంకు కలిగిన డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ బీజేపీ నుంచి, క్యామ మల్లేష్ బీఆర్‌ఎస్ నుంచి పోటీ పడుతున్నారు. కాంగ్రెస్ నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీలో ఉన్నారు. అయితే గౌడ, గొల్లకురుమ ఓట్లపై కన్నేసిన రెండు ప్రధాన పార్టీలు.. ఆయా సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులనే అభ్యర్థులుగా ప్రకటించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓ పార్టీ అభ్యర్థి గెలుపులో సంబంధిత సామాజిక వర్గం ఓట్లు కీలకపాత్ర పోషించాయి. దాదాపు ఈ ఫార్ములానే అనుసరిస్తున్న అభ్యర్థులు.. తమ సామాజిక వర్గం ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టేందుకు వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నారు.

గ్రామాల వారీగా జాబితాలు సిద్ధం
సామాజిక వర్గం ఓట్లు సాధించడానికి అభ్యర్థులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. గౌడ, గొల్లకుర్మ, పద్మశాలి, ముదిరాజ్, విశ్వకర్మలు, మున్నూరు కాపుతో పాటు మిగతా బీసీ కులాల ఓటర్ల జాబితాలను ఇప్పటికే సిద్ధం చేశారు. ఆయా సామాజిక వర్గాల పెద్దలను, నాయకులను ప్రత్యేకంగా కలుస్తున్నారు. వారంతా ఇదే సమయంగా తమ డిమాండ్లను అభ్యర్థుల ముందు ఉంచుతున్నారు. అందుకు అభ్యర్థులు కూడా సానుకూలంగా స్పందిస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రత్యేకంగా కొందరు నాయకులను ఎంపిక చేసి మండలాల వారీగా ఆయా కుల సంఘాలతో సదస్సులు నిర్వహిస్తున్నారు.

కొందరు పార్టీకే ప్రాధాన్యం
కులాల వారీగా బీసీలను ఏకం చేసి ఓట్లు రాబట్టుకునేందుకు అభ్యర్థులు ప్రయత్నిస్తున్నా కొందరు పార్టీకే ప్రాధాన్యం ఇస్తున్నారు. తమకు అభ్యర్థుల కంటే పార్టీయే ప్రధానం అని తేల్చి చెబుతున్నారు. పార్టీ నిర్ణయం మేరకే ఓటు వేస్తామని తేల్చి చెబుతుండడం అభ్యర్థులకు మింగుడు పడడం లేదు. ఇటీవల యాదగిరిగుట్టలో జరిగిన ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఓ సామాజిక వర్గం నాయకుడు తన అభిప్రాయాన్ని వేదికపైనుంచి స్పష్టంగా చెప్పారు. అభ్యర్థులు తమ సామాజిక వర్గం అయినప్పటికీ పార్టీ ప్రకటించిన వ్యక్తికే పని చేస్తామని మరికొందరు నాయకులు ప్రకటించారు.

ఎంపీ బరిలో కొత్త ముఖాలు

- భువనగిరి, నల్లగొండ స్థానాల్లో ఐదుగురు అభ్యర్థులు మొదటిసారి పోటీ
- కాంగ్రెస్ నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ తరఫున క్యామ మల్లేష్, కంచర్ల కృష్ణారెడ్డి
- బీజేపీ క్యాండిడేట్ సైదిరెడ్డికి గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం



క్యామ మల్లేష్, భువనగిరి, బీఆర్‌ఎస్



కిరణ్‌కుమార్‌రెడ్డి భువనగిరి, కాంగ్రెస్



కంచర్ల కృష్ణారెడ్డి నల్లగొండ, బీఆర్‌ఎస్



కె.రఘువీర్‌రెడ్డి నల్లగొండ, కాంగ్రెస్



శానంపూడి సైదిరెడ్డి నల్లగొండ, బీజేపీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో ఈసారి ఎక్కువ మంది కొత్త వ్యక్తులు బరిలోకి దిగుతున్నారు. ఒకప్పుడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న వారు, హేమాహేమీలు పోటీ చేయగా ఈసారి కొత్త ముఖాలు రంగంలో ఉంటున్నాయి. ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్నది రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబాల వారే అయినప్పటికీ వారు ప్రత్యక్షంగా ఓ ఎమ్మెల్యే, ఎంపీ స్థాయిలో పని చేయలేదు. ఇక, గతంలో ప్రజా ప్రతినిధులుగా పనిచేసిన వారు కొద్ది మందే బరిలో ఉంటున్నారు. వీరిలో ప్రజలు ఎవరికి మద్దతు పలుకుతారో వేచిచూడాల్సిందే.

కాంగ్రెస్ నుంచి ఇద్దరూ కొత్తవారే
నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్‌రెడ్డి పోటీలో ఉండబోతున్నారు. రాజకీయ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చిన రఘువీర్‌రెడ్డి ప్రజాప్రతినిధిగా ఇంత వరకు పని చేయలేదు. మొదటిసారి పోటీలో నిలుస్తున్నారు. రఘువీర్ తండ్రి జానారెడ్డికి మాత్రం రాష్ట్రంలో అత్యధిక మంత్రి పదవులు నిర్వహించి న నేతగా పే రుంది. ఇక భువనగిరిలో నూ కాంగ్రెస్ పార్టీ చామల కిరణ్‌కుమార్ రెడ్డిని పోటీలో నిలుపుతోంది. ఆయన కూడా ఇప్పటి వరకు ఎక్కడా పోటీ చేయలేదు. మొదటిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కూడా..
బీఆర్‌ఎస్ నుంచి పోటీలో ఉండబోతున్న వారికి రాజకీయ నేపథ్యం ఉన్నా ఎంపీ ఎన్నికల్లో మొదటి సారి పోటీ చేస్తున్నారు. నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డికి బరిలో ఉన్నారు. ఆయన ఇప్పటి వరకు ఎక్కడా పోటీ చేయలేదు. భువనగిరి పార్లమెంట్ స్థానంలో బీఆర్‌ఎస్‌నుంచి పోటీలో ఉన్న క్యామ మల్లేష్ సీనియర్ నాయకుడే. గతంలో డీసీసీ అధ్యక్షుడిగా, ఇతర చిన్న పదవులు చేసినా.. ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేయలేదు. ఇప్పుడు మొదటిసారిగా ఎంపీ బరిలో నిలుస్తున్నారు.

గతంలో ఒకరు ఎంపీగా, మరొకరు ఎమ్మెల్యేగా..
బీజేపీ భువనగిరి టికెట్‌ను బూర నర్సయ్యగౌడ్‌కు ఇచ్చింది. గతంలో ఆయనకు ఎంపీగా పనిచేసిన అనుభవం ఉంది. 2014 ఎన్నికల్లో ఆయన బీఆర్‌ఎస్ నుంచి ఎంపీగా గెలుపొందారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతిలో బూర నర్సయ్యగౌడ్ ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో బీజేపీనుంచి పోటీలో ఉంటున్నారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గం నుంచి హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని బీజేపీ పోటీలో నిలుపుతోంది. ఆయన 2018లో హుజూర్‌నగర్ నుంచి పోటీ చేసి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చేతిలో ఓడిపోయారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ ఎంపీగా పోటీ చేసి, విజయం సాధించారు. దీంతో ఎమ్మెల్యే పదవికి ఉత్తమ్ రాజీనామా చేశారు. అదే ఏడాది నిర్వహించిన ఉప ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోటీచేసిన సైదిరెడ్డి.. ఉత్తమ్ సతీమణి పద్మావతిపై విజయం సాధించారు. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌నుంచి పోటీ చేసిన సైదిరెడ్డి తిరిగి ఉత్తమ్ చేతిలో ఓడిపోయారు. దీంతో సైదిరెడ్డి బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరి, ఎంపీ అభ్యర్థిగా మొదటిసారి అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

● వరిగడ్డికి డిమాండ్



తీవ్ర వర్షాభావంతో పశుగ్రాసానికి కొరత ఏర్పడింది. ముందు చూపుతో రైతులు భూదాన్‌పోచంపల్లి ప్రాంతానికి వచ్చి గడ్డి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. మోపు రూ.10వేల నుంచి రూ.15వేలు పలుకుతున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన రైతులు తెలిపారు. - వివరాలు 9లో

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

● అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

వలిగొండ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం వలిగొండ వ్యవసాయ మార్కెట్ యార్డు, ఏదుళ్లగూడెం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటా వేయడంతో పాటు ఏరోజుకారోజు మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. హమాలీల కొరత ఉంటే వెంటనే సమకూర్చుకోవాలన్నారు. కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి గోపికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కార్యదర్శి వహీద్ పాల్గొన్నారు.

ప్రజలపక్షాన పోరాడేది కేసీఆర్ ఒక్కరే

● మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, పైళ్ల శేఖర్‌రెడ్డి తదితరులు

సాక్షి, యాదాద్రి : తెలంగాణ ప్రజలహక్కుల కోసం కొట్లాడాలంటే ఒక్క కేసీఆర్ తోనే సాధ్యమని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండి పోతుంటే ఒక్క మంత్రి కూడా మాట్లాడం లేదన్నారు. వంద రోజుల్లో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. మార్పు తెస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్రాన్ని పదేళ్లు వెనకకు తీసుకుపోయిందని ఎద్దేవా చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌లు రెండు ఒక్కటే అని పేర్కొన్నారు. తెలంగాణాలో కలిసి ఉంటాయని, ఢిల్లీలో మాత్రం కొట్టుకుంటాయన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఇద్దరు దొంగలు ఒక్కటై కేసీఆర్ ,కేజ్రీవాల్ ను లేకుండా చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీకి ఓటు వేస్తే కాంగ్రెస్‌కు ఓటు వేసినట్లేనన్నారు. జిల్లాలో రోజూ దొంగతనాలు జరుగుతున్నా, రైతుల పంట పొలాలు ఎండుతుంటే జిల్లాకు చెందిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 20 రోజులుగా పత్తాలేడన్నారు. మంత్రి చెప్పినా మిల్లర్లు తక్కువ ధరకు రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించగా, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్లపై అవగాహన ఉండాలి

● కలెక్టర్ హనుమంతు కే.జెండగే



ఎన్నికల అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి, యాదాద్రి : నామినేషన్ల స్వీకరణ, హెల్ప్‌డెస్కల ద్వారా అందజేసే సేవలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నామినేషన్ల స్వీకరణ, ఎన్‌కోర్, హెల్ప్ డెస్కలపై అధికారులకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నామినేషన్ల ఘట్టంలో నామినేషన్ల పరిశీలన, తిరస్కరణ ముఖ్యమైన అంశాలని, వీటిపై సరైన అవగాహన ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థి దేశ పౌరుడై ఉండాలని, నామినేషన్ల స్క్రూటీన్నీ రోజు నాటికి 25 సంవత్సరాల వయస్సు నిండి వుండాలని, నేరచరిత్ర ఉండకూడదని, గతంలో ఎన్నికల్లో పోటీ చేసి ఖర్చు సమర్పించని వ్యక్తులు అనర్హులుగా పేర్కొన్నారు. నామినేషన్ ప్రక్రియ ఆరు విభాగాలుగు ఉంటుందన్నారు. నామినేషన్లు, డిపాజిట్లు, ప్రపోజర్లు, గుర్తుల కేటాయింపు, నోటరీపై అభ్యర్థులకు హెల్ప్ డెస్క్ ద్వారా సహాయ, సహకారం అందజేయాలని సూచించారు. అభ్యర్థులు జనరల్ రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో రూ.12,500 చెల్లించవలసి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టరు గంగాధర్, ఆర్డీఓ అమరేందర్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ట్రైనర్లు నర్సిరెడ్డి, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి
ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని నోడల్ అధికారులకు కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన సామగ్రిని సిద్ధం చేయాలని, సువిధ, సీవిజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కోరారు. దివ్యాంగులు, వృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.

హాస్టళ్ల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
సాక్షి, యాదాద్రి : హాస్టళ్లలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, నిర్వహణ గాడి తప్పితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతు కే.జెండగే హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంక్షేమ, గురుకుల వసతి గృహాల అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. నాణ్యమైన భోజనం అందజేయాలని, పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులు తరచూ హాస్టళ్లను సందర్శించి సమస్యలను గుర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, ఆర్డీఓ అమరేందర్, సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సంక్షేమ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అండర్‌పాస్ పనుల్లో కదలిక

- చౌటుప్పల్‌లో మూడు చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం
- మొదలైన సాయిల్ టెస్టింగ్ పనులు
- మట్టి,రాళ్ల శాంపిళ్ల సేకరణ
- పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలింపు
- రిపోర్టు రాగానే బ్రిడ్జీల పనులు ప్రారంభం



మున్సిపల్ కాంప్లెక్స్ ఎదుట సర్వీస్ రోడ్డులో సాయిల్ టెస్టింగ్ కోసం ఏర్పాటు చేసిన యంత్రం



జాతీయ రహదారిపై చిన్నకొండూరు క్రాస్ రోడ్డు వద్ద మట్టి, రాళ్ల నమూనాల సేకరణ

చౌటుప్పల్ : హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ పట్టణంలో వెహికిల్ అండర్‌పాస్ నిర్మాణ పనులు (వీయూపీ) మొదలయ్యాయి. సోమవారం సాయిల్ టెస్ట్ పనులు చేపట్టారు. గత నెల టెండర్లు పూర్తయిన విషయం తెలిసిందే. హరియాణ రాష్ట్రానికి చెందిన కాంట్రాక్ట్ సంస్థ అండర్‌పాస్ బ్రిడ్జి పనులు దక్కించుకుంది.

మూడు ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు
సింగిల్ లేన్‌గా ఉన్న జాతీయ రహదారిని 14 ఏళ్ల క్రితం నాలుగు లేన్లుగా మార్చారు. అయినప్పటికీ రహదారిపై ప్రమాదాలు తగ్గలేదు. ప్రధానంగా గ్రామాలు, పట్టణాలు, జంక్షన్ల వద్ద ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. కాగా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నందిగామ వరకు ప్రమాదకర ప్రాంతాలు, జంక్షన్లు, బ్లాక్‌స్పాట్‌లను ప్రమాదరహితంగా మార్చేందుకు గత మూడేళ్ల క్రితమే కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అందుకు అవసరమైన నిధులను మంజూరు చేసింది. వివిధ కారణాలతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఎట్టకేలకు ఈ ఏడాది మార్చిలో టెండర్లు పూర్తయ్యాయి. అండర్‌పాస్‌లు లేకుండా రహదారి నిర్మాణం జరిగిన చౌటుప్పల్, చిట్యాల పట్టణాల్లో ప్రమాదాల నివారణకు వెహికిల్ అండర్ పాస్‌లను నిర్మించాలని ప్రతిపాదించారు. ఆ మేరకు చౌటుప్పల్‌లో ఆర్టీసీ బస్టాండ్, వలిగొండ క్రాస్ రోడ్డు, చిన్నకొండూర్ – తంగడపల్లి చౌరస్తాల మధ్య మూడు చోట్ల అండర్‌పాస్‌లు రానున్నాయి. వీటితో పాటు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లే దారిలో కూడా అండర్‌పాస్ ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి.

ఆరు లేన్లకు అనుగుణంగా నిర్మాణం
చౌటుప్పల్ పట్టణంలో అండర్‌పాస్ బ్రిడ్జి పనులు ప్రారంభం అయ్యాయి. అండర్‌పాస్ పిల్లర్లు పటిష్టంగా ఉండటానికి భూమిలో బలాన్ని గుర్తించాల్సి ఉంటుంది. ఇందుకోసం 100 ఫీట్ల నుంచి 150 ఫీట్ల లోతు వరకు సాయిల్ టెస్టు చేయనున్నారు. ప్రతి రెండున్నర మీటర్లకు ఒకసారి మట్టి, రాళ్ల శాంపిల్స్ సేకరిస్తారు. సేకరించిన శాంపిళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించనున్నారు. భూమి గట్టితనాన్ని బట్టి ఆ ప్రాంతంలో పిల్లర్లను డిజైన్ చేస్తారు. ఇందుకు సంబంధించి సాయిల్ టెస్టింగ్ పనులు సోమవారం మొదలయ్యాయి. ఒక్కో పాయింట్ సాయిల్ టెస్టింగ్ కోసం రెండు రోజుల సమయం పడుతుంది. భూమి నాణ్యత తేలిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆరు వరుసల రహదారి డిజైన్‌కు అనుగుణంగా బ్రిడ్జి నిర్మాణం జరగనుంది.



సాయిల్ టెస్టింగ్ యంత్రాల ద్వారా భూమి నుంచి తీసిన రాళ్లు, మట్టి

క్లుప్తంగా

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


శ్రీరాములు (ఫైల్)

గరిడేపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గరిడేపల్లి మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన జాల శ్రీరాములు(48) రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య జాల జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వరి కొయ్యలను కాల్చేందుకు వెళ్లి..

- మంటలంటుకొని రైతు మృతి

మాడుగులపల్లి: వరి కొయ్యలను తగులబెడుతుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని రైతు మృతి చెందాడు. మాడుగులపల్లి మండలం చెరువుపల్లి గ్రామంలో సోమవారం ఈ విషాద ఘటన జరిగింది. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువుపల్లి గ్రామానికి చెందిన బొల్లం లింగయ్య (70) ఉదయం తన పొలంలో వరి కొయ్యలను తగులబెట్టేందుకు వెళ్లాడు. కొయ్యలకు నిప్పంటించగా దట్టమైన పొగలు వ్యాపించి ఊపిరాడక పడిపోవడంతో మంటలంటుకొని కాలిన గాయాలతో పొలంలోనే మృతి చెందాడు. మధ్యాహ్నం స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ ఘటనకు సంబంధించిన తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలను తెలంగాణ రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్‌ఎంఎస్‌ఏ) జాయింట్ డైరెక్టర్ ఉషారాణి సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న పరిస్థితులపై ఉపాధ్యాయులను, అభ్యసన ఫలితాలపై ప్రత్యక్షంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఇటీవల జరిగిన ఘటనలపై ఆమె ఆరా తీసినట్లు సమాచారం. ఆమె వెంట అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సాయిఈశ్వరి, మండల విద్యాధికారి చత్రునాయక్ ఉన్నారు.

జోరుగా పీడీఎస్ బియ్యం దందా

- యథేచ్ఛగా సాగుతున్న రవాణా
- డీలర్ల నుంచే సేకరిస్తున్న వ్యాపారులు
- రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు


దేవరకొండ మండలం ఇద్దంపల్లి వద్ద పట్టుబడిన 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం

చింతపల్లి: నల్లగొండ–నాగర్‌కర్నూల్ జిల్లాల సరిహద్దుల్లో రేషన్(పీడీఎస్) బియ్యం దందా యథేచ్ఛగా సాగుతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా అక్రమార్కులు దేవరకొండ నియోజకవర్గ పరిసర ప్రాంతాల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారు. పేదలు కడుపు నిండా భోజనం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాయితీపై ఉచితంగా అందజేస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారింది. పోలీసు అధికారులు అడపాదడపా తనిఖీలు చేస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా శనివారం చింతపల్లి మండల కేంద్రంలో 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం, దేవరకొండ మండలం ఇద్దంపల్లి వద్ద 50 క్వింటాళ్లు, డిండి మండలం చెర్కుపల్లి వద్ద 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని దేవరకొండ, చింతపల్లి, డిండి, చందంపేట మండలాలు నాగర్‌కర్నూల్ జిల్లాకు సరిహద్దున ఉండడంతో ఇక్కడ రేషన్ బియ్యాన్ని సేకరించి దళారులు కల్వకుర్తి, చారగొండ మండల కేంద్రాల్లోని రైస్ మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

డీలర్ల నుంచి సేకరణ

గతంలో లబ్ధిదారులు రేషన్ దుకాణాల్లో రాయితీపై కొనుగోలు చేసిన బియ్యాన్ని దళారులకు విక్రయించేవారు. అధికారుల నిఘా పెరగడంతో ఇది చాలా వరకు తగ్గింది. ఇదే అదునుగా భావించిన కొంత మంది రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ చేసేటప్పుడు లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు తీసుకుని కిలోకు రూ.8 వరకు చెల్లిస్తున్నారు. డీలర్ల నుంచి దళారులు రేషన్ బియ్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా మారుమూల ప్రాంతాలు, మండల సరిహద్దు ప్రాంతాల్లో లారీ, డీసీఎం, టాటా ఏస్ వాహనాల్లో లోడ్ చేసి నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తికి అక్రమంగా రవాణా చేస్తున్నారు. దళారులు ఈ విధంగా సేకరించిన రేషన్ బియ్యాన్ని కిలోకు రూ.13 నుంచి రూ.16 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. దళారులకు నాయకుల అండదండలు ఉండడంతో ప్రతి నెల అక్రమ రవాణా సాగిస్తున్నట్లు సమాచారం.

మన బియ్యం మనకే..

రేషన్ దుకాణాల్లో, గ్రామాల్లో దళారుల సేకరించిన రేషన్ బియ్యాన్ని కల్వకుర్తిలోని ఓ ప్రాంతంలో రీసైక్లింగ్ చేసి కర్నూల్ బియ్యం పేరుతో బ్యాగుల్లో ప్యాక్ చేసి తిరిగి నియోజకవర్గ పరిసర ప్రాంతాల్లోని కిరాణ దుకాణాల్లో విక్రయిస్తున్నారు.

పట్టించుకోని రెవెన్యూ అధికారులు..

మండల సరిహద్దు ప్రాంతాల్లో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లు ప్రజలు సమాచారం అందిస్తున్నా రెవెన్యూ అధకారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో వంద టన్నులకు పైగా పీడీఎస్ బియ్యం పట్టుబడడంతో దేవరకొండ నియోజకవర్గంలో ఈ దందా జోరుగా సాగుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ దందా 4వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జోరుగా సాగుతున్నట్లు సమాచారం.

యాదాద్రి మెట్ల మార్గం పరిశీలన

- తగిన సౌకర్యాలు కల్పిస్తామన్న ఈఓ భాస్కర్‌రావు


యాదాద్రి ఆలయ మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న ఈఓ భాస్కర్‌రావు, అధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మెట్ల మార్గంలో వెళ్లే భక్తులకు సౌకర్యాలు కల్పించే విధంగా ఈఓ భాస్కర్‌రావు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం మెట్ల మార్గాన్ని ఆయన పరిశీలించారు. మెట్ల మార్గంలో వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారు, వారికి ఏమేమి సౌకర్యాలు కావాలనే అంశాలపై అధికారులతో చర్చించారు. మెట్ల దారిలో వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక చింతనను కలిగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. కాలినడకన వచ్చే భక్తులకు మెట్ల మార్గంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని, రాత్రి సమయంలో సైతం భక్తులు కొండపైకి మెట్ల దారిలో వచ్చే విధంగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆయన వెంట ఆయా విభాగాల అధికారులున్నారు.

వైభవంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

యాదగిరిగుట్ట : యాదాద్రి కొండపై ఉన్న శివాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి వసంత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం శ్రీసీతారామహనుమత్ మూలమంత్ర జపాలు, దశ శాంతి పంచసూక్త పారాయణాలు, అభిషేకం చేపట్టారు. అనంతరం ఆధ్యాత్మ రామాయణ పారాయణం, శ్రీసీతారామ హనుమత్ మూర్తులకు అష్టోత్తర శత నామార్చనలు గావించారు. సాయంత్రం సహస్ర నామార్చనలు, నివేధన, నీరాజన, మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, భక్తులు పాల్గొని పూజలు చేశారు.

ఏసీబీ వలలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్

- రూ.18వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు


పట్టుబడిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్

నల్లగొండ టౌన్: నల్లగొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఊరెల్లి సోమేశ్వర్ లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికాడు. ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామంలోని నూకల వెంకట్‌రెడ్డి చారిటబుల్ ఆస్పత్రిలో ఫార్మసీ ఏర్పాటు లైసెన్స్ కోసం చిట్టెపు సైదిరెడ్డి అనే వ్యక్తి దరఖాస్తు చేసుకున్నారు. లైసెన్స్ ఇవ్వడానికి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వర్ రూ.20వేలు లంచం డిమాండ్ చేయగా.. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు సోమవారం నల్లగొండలోని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో రూ.18వేలు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఇవ్వడానికి సైదిరెడ్డి వెళ్లాడు. డబ్బులను తన బ్యాగులో పెట్టాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సూచించడంతో రూ.18 వేలను బ్యాగులో పెట్టగానే అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు సోమేశ్వర్‌ను పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని సోమేశ్వర్‌ను అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో ప్రవేశ పెట్టడానికి తీసుకెళ్లారు. సీఐలు వెంకట్‌రావు, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి


శ్రవణ్ (ఫైల్)

చిట్యాల: స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన చిట్యాల పట్టణ శివారులో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన నూనె సంజీవ కుమారుడు నూనె శ్రవణ్‌కుమార్(22) తన స్నేహితులతో కలిసి సోమవారం చిట్యాల పట్టణ శివారులోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లాడు. శ్రవణ్‌కుమార్ ఈత కొడుతున్న క్రమంలో అస్వస్థకు గురయ్యాడు. స్నేహితులు, స్థానికులు వెంటనే అతడిని నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా మృతిచెందాడు. అనంతరం శ్రవణ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి బుగ్గమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చిట్యాల ఎస్‌ఐ–2 లింగయ్య తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

- ఐదున్నర తులాల బంగారం, 70తులాల వెండి ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

దేవరకొండ: పట్టణంలోని ఓ ఇంట్లో సోమవారం పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దేవరకొండ సీఐ పర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో నివాసముంటున్న శవ్వ మల్లికార్జున్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం 11గంటల సమయంలో పని నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లిన మల్లికార్జున్ మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఇంటి లోపలి నుంచి గడియ పెట్టి ఉండడంతో అనుమానం వచ్చి వెనుక నుంచి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న ఐదున్నర తులాల బంగారంతో పాటు 70 తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కప్పల లింగమ్మ పోరాటం చిరస్మరణీయం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ప్రజా సమస్యలపై కప్పల లింగమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన కప్పల లింగమ్మ సంతాపసభకు ఆయన హాజరై మాట్లాడారు. సీపీఐ తరఫున కప్పల లింగమ్మ అనేక ప్రజా ఉద్యమాలకు నాంది పలికారన్నారు. సమస్య ఎక్కడ ఉంటే అక్కడ ఆమె ప్రత్యక్షమై నిస్వార్థంగా ప్రజాసేవకు అంకితమయ్యిందన్నారు. లింగమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, నాయకులు బొమ్మగాని ప్రభాకర్, గన్న చంద్రశేఖర్, పల్లె నరసింహ, బెజవాడ వెంకటేశ్వర్లు, సత్యం, అనంతుల మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

- ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్


మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

సూర్యాపేట: కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని సీతారామ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌ఎస్‌యూఐ ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించిందని, లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటే అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత రాజకీయాలు తప్ప దేశాన్ని అభివృద్ధి చేయడం లేదన్నారు. బీజేపీ దేవుడి పేరు వాడుకొని అధికారంలోకి రావడం తప్ప పేద ప్రజల అవసరాలు తీర్చడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర ఇన్‌చార్జి మహ్మద్ ఫహాద్, ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ డీఎస్పీ భార్య ఆందోళన


భర్త ఇంటి ఎదుట బైఠాయించిన జ్యోతి

తుర్కయంజాల్: 'నా భర్త నాకు కావాలి.. నా పిల్లలు నాకు కావాలి.. నాకు న్యాయం చేయాలి' అంటూ ఓ మహిళ.. భర్త ఇంటి ఎదుట ఆందోళనకు దిగిన ఘటన సోమవారం రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. నాగార్జునసాగర్‌కు చెందిన రంగనాథ్‌నాయక్ మెదక్ ఏఆర్ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. 2007లో మిర్యాలగూడకు చెందిన జత్లావత్ జ్యోతితో ఇతనికి వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా ప్రస్తుతం హాస్టల్‌లో చదువుకుంటున్నారు. 2018నుంచి తుర్కయంజాల్‌లో నివాసం ఉంటున్న రంగనాథ్‌నాయక్ దంపతుల మధ్య నెలకొన్న మనస్పర్థలతో 2021నుంచి గొడవలు జరుగుతున్నాయి. గతేడాది నవంబర్‌లో పుట్టింటికి వెళ్లిన జ్యోతి నల్లగొండ ఉమెన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ కేసు విచారణ కొనసాగుతుండగా సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి తుర్కయంజాల్ చేరుకున్న జ్యోతి ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. రంగనాథ్‌నాయక్ ఆమెను అడ్డుకోవడంతో ఇంటి ఎదుట బైఠాయించి నిరసన తెలిపింది. అనంతరం 100కు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న ఆదిబట్ల పోలీసులు రంగనాథ్‌తో చర్చించారు. దీంతో ఆయన భార్యను ఇంట్లోకి అనుమతించారు. తన భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, విడాకులు ఇవ్వాలంటూ వేధిస్తున్నాడని జ్యోతి ఆరోపించింది.

కుక్కల దాడిలో జింక మృతి


గాయపడిన జింకకు వైద్యం చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ ఎల్లేష్

మర్రిగూడ: కుక్కల దాడిలో జింక మృతిచెందింది. వివరాలు.. మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి గ్రామ సమీపంలో సంచరిస్తున్న జింకపై సోమవారం వీధి కుక్కలు దాడి 15సీపీఎల్ 803– గాయపడిన జింకకు వైద్యం చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ ఎల్లేష్ చేసి గాయపర్చాయి. అదే సమయంలో అటుగా ఉపాధి పనులకు వెళ్తున్న గ్రామస్తులు గమనించి ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా తిరుమలేష్‌కు విషయం తెలుపగా.. ఆయన స్థానిక పోలీసులకు, సంబంధిత ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చి, ఓ ప్రైవేట్ వాహనంలో గ్రామస్తులు సహాయంతో జింకను మర్రిగూడ పశువైద్యశాలకు తీసుకొచ్చారు. జింక ముందు ఎడమ కాలు, వెనుక కుడి కాలుకు తీవ్రంగా గాయాలు కాగా.. వెటర్నరీ అసిస్టెంట్ ఎల్లేష్ జింకకు వైద్యం అందించినప్పటికీ అది మృతిచెందింది. ఈ మేరకు పంచనామా నిర్వహించి కమ్మగూడలో జింకను ఖననం చేసినట్లు అటవీశాఖ బీట్ ఆఫీసర్ ఎన్. నవీన్ తెలిపారు.

వసతి గృహం సిబ్బందిపై కేసు నమోదు

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. భువనగిరి మండలంలోని బొల్లెపల్లికి చెందిన ఏడో తరగతి విద్యార్థి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వసతి గృహ సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ అనంతరం బాధ్యులైన అధికారులు, సిబ్బంది పైన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమంలో ఫ్లెక్సీ వైరల్



నెమిలలో గ్రామస్తులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

రాజాపేట : లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రచారానికి విచ్చేసే నాయకులకు తమ డిమాండ్లను తెలుపుతూ రాజాపేట మండలంలోని నెమిల గ్రామంలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. 'మాకు పనికిమాలిన ఉచిత పథకాలు వద్దు', 'అన్నదాతల ఆత్మహత్యలు లేని వ్యవసాయ విధానాలు కావాలి' వంటి పలు డిమాండ్లతో కూడిన ఫ్లెక్సీని నెమిల గ్రామ స్టేజీ వద్ద నాలుగు రోజుల క్రితం గ్రామస్తులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కాగా ఈ ఫ్లెక్సీని వెంటనే ఎన్నికల అధికారులు తొలగించారు. కానీ ఫ్లెక్సీకి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

భారీగా నగదు పట్టివేత


రాజేష్‌చంద్ర, భువనగిరి డీసీపీ

భువనగిరి క్రైం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో భారీగా నగదు పట్టుకున్నట్లు భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల రోజుల్లో రూ.19,08,669 నగదు, 2,402 లీటర్ల మద్యం, 5.58 కేజీల గంజాయి పట్టుకున్నట్లు డీసీపీ తెలిపారు. ఎవరైనా రూ.50వేలకు మించి నగదు తరలిస్తే సరైన ఆధారాలు చూపాలన్నారు. లేదంటే సీజ్ చేస్తామన్నారు. అక్రమంగా డబ్బులు, మద్యం తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రాణం తీసిన సరదా..

- ట్రాక్టర్‌పై చెరువు వద్దకు వెళ్తుండగా బోల్తా
- బాలుడు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


శివం మృతదేహం

భూదాన్‌పోచంపల్లి: సరదాగా ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్తుండగా.. ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం సాయంత్రం భూదాన్‌పోచంపల్లి మండలంలోని ధర్మారెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గత మూడు రోజులు జరిగాయి. గ్రామానికి చెందిన సుర్వి నాగరాజు కుమారుడు సుర్వి కౌశిక్ హయత్‌నగర్‌లో ఉంటూ 10వ తరగతి చదువుతున్నాడు. కౌశిక్ తన స్వగ్రామంలో జరుగుతున్న పండుగకు హయత్‌నగర్‌లోని ఎల్లారెడ్డికాలనీలో ఉంటున్న తన ఐదుగురు స్నేహితులను పిలిచాడు. మూడు రోజులుగా గ్రామంలో వారంతా సరదాగా గడిపారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం స్నేహితులంతా కలిసి సరదాగా ట్రాక్టర్ నడుపుకుంటూ గ్రామ శివారులో ఉన్న చెరువు కట్ట వద్దకు వెళ్లారు. అక్కడ మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో ట్రాక్టర్ నడుపుతున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివం(16), మోత్కూర్ మండలం దత్తాయిపల్లికి చెందిన బెల్లి సాయికుమార్ ట్రాక్టర్ ఇంజిన్ కింద పడిపోయారు. శివం అక్కడికక్కడే మృతి చెందగా, సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా నలుగురు స్నేహితులు మాత్రం ట్రాక్టర్ నుంచి దూకి ప్రాణాలను రక్షించుకున్నారు. సమీపంలోని కొందరు గ్రామస్తులు గమనించి వెంటనే జేసీబీతో బోల్తాపడిన ట్రాక్టర్ ఇంజిన్‌ను పైకి లేపి గాయపడిన సాయికుమార్‌ను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తల, ఛాతికి తీవ్ర గాయాలు కావడంతో సాయికుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి పంచనామా నిర్వహించారు. అనంతరం శివం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మృతుడు శివం తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం హయత్‌నగర్‌కు వచ్చి అక్కడ బండలు వేసే పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నట్లు తెలిసింది. శివం ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు.

తహసీల్దార్ కార్యాలయానికి తాళం


రికార్డు గదికి వేసిన తాళం


రిజిస్ట్రేషన్ జరిగే గదికి తాళం వేయడంతో ఆరుబయట నిరీక్షిస్తున్న రైతులు

- 42 నెలలుగా అద్దె ఇవ్వడంలేదని భవన యజమాని ఆగ్రహం
- బిల్లులు చేసి పంపించినా ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో పెండింగ్
- ఎన్నిమార్లు ప్రయత్నించినా అందని అద్దె బకాయిలు

చౌటుప్పల్: చౌటుప్పల్‌లోని తహసీల్దార్ కార్యాలయానికి భవన యజమాని తాళం వేశాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. వివరాలు.. గతంలో చౌటుప్పల్ తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం ఉండేది. 2020లో సంభవించిన వరదల కారణంగా సొంత భవనం నీట మునిగింది. దీంతో అప్పటికప్పుడు తాత్కాలికంగా భవనాన్ని వెతుక్కోవాల్సి వచ్చింది. అదే సమయంలో ధరణి పోర్టల్ రావడం, తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండడంతో పక్కా భవనం కావాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో లక్కారం శివారులో జాతీయ రహదారి వెంట దర్గా పక్కన చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ఎంఏ. రషీద్‌కు చెందిన భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. 2020 అక్టోబర్ 23న అద్దె భవనంలో ఏర్పాటు చేసిన తహసీల్దార్ కార్యాలయాన్ని అప్పటి ఆర్డీఓ సూరజ్‌కుమార్ ప్రారంభించారు.

42 నెలలుగా బకాయి..

నెలకు రూ.46వేల అద్దె మాట్లాడుకున్నారు. ఆ మేరకు అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇప్పటికీ 42నెలలు గడిచినప్పటికీ భవన యజమాని రషీద్‌కు మాత్రం అద్దె చేతికి అందలేదు. గతంలో రూ.3లక్షలు, రూ.3లక్షలు, రూ.1.50లక్షల చొప్పున మూడు పర్యాయాలు ఇంటి అద్దె బిల్లులు చేశారు. ట్రెజరీకి పంపించారు. అక్కడ టోకెన్ నంబర్ కూడా అలాట్ అయ్యింది. కానీ నిధులు మాత్రం రాలేదు. బిల్లులు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వద్ద పెండింగ్‌లో పడ్డాయి. యజమాని తిరిగి తిరిగి వేసారినా ఫలితం మాత్రం కన్పించలేదు. బిల్లులు రావాలంటే అతన్నే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లాలని సూచించారు. అయితే ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లాలంటే ఆర్డీఓ, తహసీల్దార్ స్థాయి అధికారులు కాకుండా సామాన్యులు వెళ్లలేని పరిస్థితులు ఉన్నందున యజమాని యథావిధిగా స్థానిక అధికారులనే అడుగుతున్నాడు. చివరకు చేసేదేమీ లేక రషీద్ సోమవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని రిజిస్ట్రేషన్ చేసే గది, రికార్డు గదికి తాళాలు వేశాడు. రిజిస్ట్రేషన్ చేసే గదికి వేసిన తాళాన్ని సిబ్బంది పగులగొట్టారు. అదేవిధంగా రికార్డు గదికి వేసిన తాళాన్ని యజమాని వద్దకు వెళ్లి నచ్చజెప్పి తెచ్చుకున్నారు.

ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు

భవనం అద్దెకు ఇచ్చినప్పటి నుంచి 42 నెలలుగా నాకు ఒక్క రూపాయి కూడా అద్దె చెల్లించలేదు. గతంలో మూడు పర్యాయాలు బిల్లులు చేసి ట్రెజరీకి పంపించినా ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వద్ద పెండింగ్ పడింది. దీనిని అధికారులే క్లియర్ చేయాలి. తప్పనిసరి పరిస్థితుల్లో తాళం వేయాల్సి వచ్చింది. వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలి. నేను బ్యాంకులో ఈఎంఐ చెల్లించాల్సి ఉంది.

– ఎంఏ రషీద్, భవన యజమాని

ఏడాది బిల్లులు మాత్రమే చెల్లించాలి

తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించి భవన యజమానికి ఏడాది బిల్లులు మాత్రమే చెల్లించాల్సి ఉంది. అంతకు ముందు బిల్లులు పూర్తి చేశాం. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నెలలో బిల్లులు క్లియర్ అవుతాయి. కార్యాలయానికి ఎలాంటి తాళం వేయలేదు.

– హరికృష్ణ, తహసీల్దార్